## మూసాపేటలో రేపు కృష్ణాష్టమి వేడుకలు

**మూసాపేట:** మూసాపేటలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ ప్రాంత సహ సంయోజక్ జీవన్ శనివారం తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవ అనంతరం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మూసాపేట జనతానగర్‌లోని హనుమాన్ ఆలయం నుంచి కూకట్‌పల్లిలోని శివాలయం వరకు శ్రీకృష్ణ శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా అధికార ప్రతినిధి శశిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

## హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

**రాయదుర్గం:** గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వింగ్, హార్టికల్చర్, శానిటరీ విభాగం సహకారంతో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ పర్యవేక్షణలో క్యాంపస్‌లోని హ్యుమానిటీస్ భవనం పరిసరాలతో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు.

## నేటి నుంచి గోవర్ధనగిరి తిరునాళ్లు

**కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీకాలనీ,మలేషియా టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు గోవర్ధనగిరి తిరునాళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 5:15 గంటలకు వేణుగోపాలస్వామి వారి మేలుకొలుపు, సుప్రభాత సేవ, 5:30 గంటలకు సుగంధ పరిమళ ద్రవ్య పంచామృతాభిషేకం అనంతరం వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ సేవలు, 8 గంటలకు బాలభోగ నివేదన, ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, ఋత్విక్‌వరుణ పంచగవ్య ప్రాసన, గోపూజ, మండప ఆరాధనలు, అంకురార్పణ, ధ్వజారోహణ, 8:30 గంటలకు వేదపారాయణం, గోపూజ, 9 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల మహాకల్యాణం, 12:30 గంటలకు శ్రీవారి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు పుత్రకామేష్టి హోమం, నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, 6 గంటలకు 8 సంవత్సరాల లోపు చిన్నారులకు చిన్నికృష్ణుడి వేషధారణ పోటీలు, 7 గంటలకు ఉట్టి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**మోతీనగర్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకునేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు తమ వంతు బాధ్యతగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ వివేకానందనగర్ సేవా సమితి చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కమ్యూనిటీ హాల్‌లో సేవా సమితి అధ్యక్షులు గంగుమళ్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కేశవరావు, శ్రీనివాస్, బొంతు హరికృష్ణ, శ్రీను, అంకమరావు, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, పవన్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శివరాం, రాజు పాల్గొన్నారు.



మహిళల పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా కమిషన్ నోటీసు ఇవ్వడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. మహిళలను అనుమతించకపోవడంతో మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మహిళా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ

# మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

- సూక్ష్మ, చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి
- 20 మహిళా శక్తి క్యాంటీన్లకు ప్రతిపాదనలు సిద్ధం
- కలెక్టరేట్‌తో పాటు 3 కేంద్రాల్లో కొనసాగుతున్న పనులు
- మున్సిపల్ సర్కిళ్లు 13 పురపాలక సంఘాల్లో 17 క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు రుణం



**సాక్షి, సిటీబ్యూరో:** మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆయా సంఘాలకు భరోసా కల్పించేందుకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల నిర్వహణ బాధ్యతలను అప్పగించటం ద్వారా ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్ల నిర్వహణతో పాటు మీ–సేవ కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్ లెట్లు, మిల్క్ పార్లర్స్ ఏర్పాటుపై పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్ల, మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించి కార్యాచరణపై దృష్టి సారిస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు తీసుకుని చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.

- మేడ్చల్–మల్కాజిగిరి జిలాల్లో మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో 20 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), మెప్మా ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. డీఆర్‌డీఏ అధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ఒక మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయగా, మేడ్చల్ కలెక్టరేట్‌సహా మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో మూడు మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్మాణ పనులు చేపడుతోంది. ఈ మూడు క్యాంటీన్లు కూడా వచ్చే నెల మొదటి వారం కల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే కీసర, ఘట్‌కేసర్ మండలాల పరిధిలో మరో రెండు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

> **అర్హతను బట్టి రుణ సదుపాయం**
>
> మహిళా సంఘాల అర్హతను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 20 లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వపరంగా క్యాంటీన్లు ఏర్పాటు చేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కారు ఇటీవలే నిర్ణయం తీసుకుంది.

### మెప్మా ఆధ్వర్యంలో...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లతోసహా 13 పురపాలక సంఘాలతో కలిపి మొత్తంగా 15 మహిళా క్యాంటీన్ల ఏర్పాటునకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

- బోడుప్పల్, జవహర్ నగర్, పీర్జాదిగూడ, నిజాంపేట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, దుండిగల్, కొంపల్లి పురపాలక సంఘాల్లో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లలో కూడా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

### 10,750 సంఘాల్లో 1.09 లక్షల మంది సభ్యులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్‌డీఏ, మెప్మా అధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఐదు మండలాలకు సంబంధించి ఒక జిల్లా సమాఖ్య, ఐదు మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్ లెవల్ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. ఆయా సంఘాల్లో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

### పక్కాగా క్యాంటీన్ల నిర్వహణ

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించారు.

> **స్థలాల కోసం అన్వేషణ**
>
> మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉండే కలెక్టరేట్‌తో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని మెప్మా అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఆదిశగా క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

## కారు ఢీకొన్న ఘటనలో మహిళ మృతి

**కేపీహెచ్‌బీకాలనీ:** భార్యాభర్తలు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలోని సూర్యా రెసిడెన్సీలో నివాసం ఉండే ఉషారాణి (55) నాగమల్లేశ్వరరావులు భార్యాభర్తలు. ఈ నెల 18న ఉదయం 5:30 గంటలకు కల్వరి టెంపుల్‌కు స్కూటీపై బయలుదేరారు. బ్రాండ్ ఫ్యాక్టరీ చౌరస్తా వద్ద గుర్తు తెలియని కారు స్కూటీని ఢీకొట్టింది. గాయాలైన భార్యాభర్తలను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావు కోలుకున్నాడు. ఉషారాణికి మెరుగైన చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన చిన్నారులు



**కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ను లిటిల్ టాట్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు శనివారం సందర్శించారు. సీఐ వెంకటేశ్వరరావు పోలీస్‌స్టేషన్‌లో నిత్యం జరిగే పని విధానాన్ని వారికి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులు, నిర్వాహకులతో ఎస్ఐ లింగయ్య తదితరులు

**కూకట్‌పల్లి:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేపీహెచ్‌బీ ఎస్ఐ లింగయ్య అన్నారు. జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. దిలీప్, డాక్టర్ అశోక్, జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్, చంద్రశేఖర్, రంజిత్, సిద్ధార్థ, బ్రహ్మం, కుమార్‌రెడ్డి, అశ్వత్, అనీష్‌గౌడ్, రోహిత్, కృష్ణ, శివ పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

**మియాపూర్:** ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కండ్లకుంట గ్రామానికి చెందిన సాయికిరణ్ (24) ప్రైవేటు ఉద్యోగి. నెల రోజుల కిందట మియాపూర్ గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలో ఉంటున్న పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. ఉద్యోగం చూసుకున్నాడు.కాగా ఈ నెల 21న ఉదయం 8 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల, స్నేహితులు, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందిన సోదరుడు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## హాష్ ఆయిల్ అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

**మోతీనగర్:** ఎక్కువ డబ్బులు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో హాష్(గంజాయి) ఆయిల్ అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సామల వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. అల్లాపూర్ లక్ష్మీనగర్‌లో నివాసముండే మేకల లీల వెంకట శివరాం (25) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయి అమ్మి జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తనకు పరిచయం ఉన్న హాష్ ఆయిల్‌ను అమ్మే నూతక్కి సనీత్(సన్నీ) వద్ద కొంతకాలంగా ఆయిల్‌ను కొని మాదాపూర్, పర్వత్‌నగర్లో తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు మేకల లీల వెంకట శివరామ్ రూమ్‌పై దాడి చేశారు. హాష్ ఆయిల్‌తో పాటు శివరాంను, కొనడానికి వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 40 బాటిళ్ల హాష్ ఆయిల్, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నూతక్కి సనీత్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హ్యాష్ ఆయిల్ అమ్ముతున్న వ్యక్తిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నందుకు అల్లాపూర్ పోలీసులను, సిబ్బందిని కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్

## పాపిరెడ్డినగర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీలోని వీరాంజనేయ శివాలయంలో శనివారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఇలాంటి శిబిరాలను మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు నిహారిక, శ్రేయ, నర్సులు సునీత, లావణ్య, వైద్యశిబిరం ఆర్గనైజర్ ఓబుల్‌రెడ్డి, ఫార్మాసిస్ట్ దేవదాస్, ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నరసింహులు, నాయకులు అనంతరాములు, కిరణ్‌కుమార్, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణ, శంకర్‌రెడ్డి, గోపాల్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



# ప్రజాభిప్రాయ సేకరణ అభినందనీయం

- తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం–2024 ముసాయిదాపై అభిప్రాయ సేకరణ
- పాల్గొన్న కలెక్టర్, రిటైర్డ్ అధికారులు, ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు



**సాక్షి,సిటీబ్యూరో:** ధరణి సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం– 2024 రూపకల్పనపై అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం చర్చావేదిక కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో హర్షణీయమని పలువురు అభిప్రాయపడ్డారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. 1971లో ఆర్‌ఓఆర్ చట్టం వచ్చిందని, 1989 నుంచి ఇదే చట్ట ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాల ద్వారా భూ పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. 2020 వరకు ఈ చట్టం ప్రకారమే రెవెన్యూ శాఖ వ్యవహరించిందన్నారు. అక్టోబర్ 2020 నుంచి ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌డేషన్ చేయడమైందన్నారు. ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే జాప్యం లేకుండా పాసుపుస్తకం అందించేవారని, కానీ కొన్ని సమస్యలు ఎదుర్కొనట్లు వివరించారు. అభిప్రాయ సేకరణలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొనడంక ఆనందంగా ఉందన్నారు. బిల్లులోని అంశాలపై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. అలాగే అభిప్రాయాలను రాతపూర్వకంగా కూడా అందించాలని కలెక్టర్ సూచించారు. చర్చావేదికలో సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ చర్చా వేదికలో డీఆర్‌ఓ హరిప్రియ, అడ్మిని స్టేటివ్ ఆఫీసర్ రామ్మోహన్, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, రాజేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.అభిప్రాయ సేకరణలో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



> **వీఆర్‌ఓ వ్యవస్థ ఉండాలి**
>
> గ్రామ స్థాయిలో వీఆర్‌ఓ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న భూ సమస్యలను వీఆర్‌ఓలు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తారు. మ్యూటేషన్ తప్పనిసరిగా చేయాలి.
>
> – రవీంద్రబాబు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్

> **గ్రామ సభలు నిర్వహించాలి**
>
> గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలి. చిన్న చిన్న సమస్యలను తహసీల్దారు స్థాయిలోనే పరిష్కరించాలి. మ్యూటేషన్ తప్పకుండా చేసిన అనంతరం పాస్ పుస్తకాలను అందజేయాలి. 1971లోని భూ సంస్కరణ చట్టాలను బేస్ చేసుకొని ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా నూతన చట్టాలను రూపొందించలి.
>
> – సురేష్ పొద్దార్, వికారాబాద్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్

> **తప్పులను సవరించి చట్టాలను రూపొందించాలి**
>
> భూ సంస్కరణలలో పట్వారీ సిస్టం చాలా పాతది. చాలా కచ్చితమైనది. ఈ పద్ధతిలో చిన్న చిన్న పొరపాట్లు తప్ప.. ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి కాదు. నూతన చట్టాలను రూపొందించేటప్పుడు గతంలో జరిగిన తప్పులను సవరిస్తూ సర్వే డిపార్ట్‌మెంటు వాళ్ల సహకారం తీసుకోవాలి. రికార్డులను తప్పులు లేకుండా సవరించి వాటి ద్వారా కొత్త చట్టాలను రూపొందించాలి. రెవెన్యూ ట్రిబ్యూనల్స్ ఏర్పాటు చేయాలి.
>
> – ప్రొఫెసర్ డా.జి. మల్లికార్జున్, నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్

> **రూప కల్పనలో స్పష్టమైన ఆదేశాలు పొందుపర్చాలి**
>
> చట్టాలను రూపొందించేప్పుడు స్పష్టమైన ఆదేశాలను పొందుపర్చాలి. చట్టం తయారు చేసే వారికి, చట్టం అమలు చేసేవారికి గ్యాప్ రాకుండా ఉండాలి. ఎవరి కోసం చట్టాలు రూపొందిస్తున్నామో వారికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలి. భూ తగాదాలు కోర్టులలో పరిష్కారానికి చాలా కాలం పడుతుంది. భూ సంస్కరణలకు సంబంధించి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. అందులో జడ్జి, రెవెన్యూ ఉన్నతాధికారులను కమిటీలుగా ఏర్పాటు చేయాలి. గ్రామ స్థాయిలో ఉచితంగా సలహాలు, సూచనలు అందించేందు కస్టమర్ కేర్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలి. – అశ్విన్‌కుమార్, నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్

## అసభ్యంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేయాలి



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

**మూసాపేట:** ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తోటి వారికైనా, తల్లిదండ్రులకైనా సమాచారం ఇవ్వాలని షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు విద్యార్థినులకు సూచించారు. మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం కూకట్‌పల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో షీ టీమ్ కూకట్‌పల్లి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ ప్రమీల, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కృష్ణాష్టమి సందడి



సిద్ధిచాంప్స్ పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



పంచశీల పాఠశాలలో..

**కూకట్‌పల్లి:** కృష్ణాష్టమి సందర్భంగా శనివారం భాష్యం విద్యా సంస్థలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, రాధా, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధా మాధవి కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టడంలో పాల్గొన్నారు. సాంస్కృతిక నృత్యాలతో అలరించారు.

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** మల్లికార్జుననగర్ కాలనీలోని శిష్య ప్లే స్కూల్‌లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు. పండుగల ఔనత్యాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పించాలని ప్రిన్సిపాల్ మహేష్ అన్నారు.

**మూసాపేట:** మూసాపేటలోని పంచశీల పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అదేవిధంగా శ్రీహరినగర్‌లోని కిడ్జి మౌంట్ లిటేర పాఠశాలలో చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.



భాష్యం విద్యాసంస్థలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



శిష్య ప్లే స్కూల్‌లో..



బాలానగర్‌లోని సెయింట్ మేరీ జోసెఫ్ హైస్కూల్‌లో..



కిడ్జి మౌంట్ లిటేర పాఠశాలలో..